సాక్షి
ఏలూరు
మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



కొలిక్కిరాని బడ్జెట్ కసరత్తు
మున్సిపాలిటీల్లో బడ్జెట్ రూపకల్పన ఆలస్య మయ్యే అవకాశం ఉంది. నూతన ఎమ్మెల్యేల ఒత్తిడి కారణంగా కనిపిస్తోంది. 8లో



గంజాయిపై ఉక్కుపాదం
నేరాల నియంత్రణపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని డీఐజీ అశోక్‌కుమార్ అన్నారు. 8లో



స్విమ్మింగ్‌లో ప్రతిభ
జాతీయ సౌత్‌జోన్ స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు జిల్లాకు చెందిన బలగ స్వామి నాయుడు ప్రతిభ చూపాడు. 8లో

న్యూస్‌రీల్

నైతిక విలువలూ నేర్పించాలి



ఏపీటీఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులు పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ గురించి కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నూతన సంవత్సర డైరీ–2025ను సోమవారం కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని, పదో తరగతి పరీక్షల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషిచేయాలని కోరారు. జేసీ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషిచేయాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డి దొర, నగర శాఖ ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ఆవిష్కరించారు.

మురుగునీటి పారుదలకు చర్యలు



ఈదరలో డ్రైనేజీలో పూడికను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

ఆగిరిపల్లి: మురుగునీటి పారుదలకు సత్వరమే చర్యలు చేపట్టామని ఈ ఓపీఆర్డీ ఆనంద్ కుమార్ తెలిపారు. ఈదర గ్రామంలో దుస్థితిపై 'రోడ్డుపైనే మురుగునీటి ప్రవాహం' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి నిషాక్‌ఆలీ, సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీలోని పూడికను తొలగించారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా డ్రైనేజీ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామని నిషాక్‌ఆలీ తెలిపారు.

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీల జనాభా, వారి వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కులగణన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించామని, దీనిపై అభ్యంతరాలు ఉంటే మంగళవారం వరకు స్వీకరిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్ ప్రకటనలో తెలిపారు. జనవరి 6 వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10న కులగణన తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. సోషల్ ఆడిట్‌ను కలెక్టర్, ఆర్డీఓలు పర్యవేక్షిస్తారని తెలిపారు.

42,602 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

ఏలూరు (మెట్రో): తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని గ్రాడ్యుయేట్ ఓటర్ల తుది జాబితాను సోమవారం అధికారులు విడుదల చేశారు. ఏలూరు జిల్లాలోని 62 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల జాబితాను ప్రకటించారు. జిల్లాలో 24,895 పురుష, 17,699 మహిళా గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ఇతరులు ఎనిమిది మంది ఉండగా మొత్తంగా 42,602 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు.

గడువులోపు అర్జీలు పరిష్కరించాలి

భీమవరం: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ అర్జీలు పునరావృతం కాకుండా నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, అత్తింటి వేధింపులు, భూ, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో వంచన, ఆస్తి తగాదాలకు సంబంధించి ఎనిమిది అర్జీలను ఎస్పీ స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులు.. వెన్నుపోట్లు

ప్రకృతి ప్రకోపం.. ప్రభుత్వం రిక్తహస్తం

- కరుణించని ప్రకృతి
- భరోసా ఇవ్వని సర్కారు
- ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు
- రైతులకు అన్నింటా అన్యాయమే..

జిల్లాలో రైతులకు 2024 తీరని వేదనను మిగిల్చింది. ఓ వైపు ప్రకృతి విపత్తులు.. మరోవైపు ఆదుకోవాల్సిన ప్రభుత్వం మొండిచేయి చూపడంతో తీరని అన్యాయం జరిగింది. రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడం, ఉచిత పంటల బీమాకు ప్రభుత్వం మంగళం పాడటం, ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేయకపోవడం, ధాన్యానికి మద్దతు ధరలు రాకపోవడంతో అన్నదాతలు అగచాట్లు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకుండా అన్నదాతలకు వెన్నుపోటు పొడిచింది.

– ఏలూరు (మెట్రో)



పెదవేగి మండలం అమ్మపాలెంలో వర్షం కురవడంతో ధాన్యంపై బరకాలు కప్పుతున్న దృశ్యం (ఫైల్)

గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో రైతులకు ఏడాదిలో రెండు విడతల్లో రైతు భరోసా సొమ్ములు విడుదల చేసింది. దీని ద్వారా రైతులకు సాగు సమయంలో పెట్టుబడులకు ఇబ్బంది ఉండేది కాదు. దీంతో వ్యవసాయం పండుగలా సాగింది. అయితే ఈ ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో విఫలమైంది. సూపర్‌సిక్స్‌లో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తామన్న హామీ అమలు కాలేదు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద 2,24,016 మంది రైతులకు రూ.1,339 కోట్లు అందించగా.. కూటమి సర్కారు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.

పరిహారం.. పరిహాసమే..

జిల్లావ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు కుదేలవుతుంటే కూటమి సర్కారు చూస్తూ ఊరుకుండే తప్ప భరోసా ఇవ్వలేదు. పంటలు నీటమునిగి నష్టపోతున్నా పట్టించుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేలా ఇన్‌పుట్ సబ్సిడీ అందించింది. ఇలా జిల్లాలో 50,290 మంది రైతులకు రూ.39.28 కోట్లు సాయం చేసి ఆదుకుంది. కూటమి సర్కారులో అకాల వర్షాలకు పంట నష్టపోయినా పరిహారం అందించిన దాఖలాలు లేవు.

బీమాతో లేదిక ధీమా

కూటమి సర్కారు రైతులను అన్నిరకాలుగా ఇబ్బంది పెట్టింది. రైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేసింది. రైతులే ప్రీమియం కట్టుకోవాలని ఆదేశించడంతో వీరిపై భారం పడింది. గత ఐదేళ్లలో జిల్లాలో 9,125 మంది రైతులకు రూ.12.87 కోట్లను బీమా ప్రీమియంగా చెల్లించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంది. అలాగే పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం త్వరితగతిన అందించేలా ఏర్పాట్లు చేసింది.

2024 రివైండ్

ధాన్యం.. దళారుల రాజ్యం

ఆరుగాలం శ్రమించి పండించిన పంట అమ్మకం విషయంలోనూ రైతులకు కూటమి ప్రభుత్వం చుక్కలు చూపించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా 120 రైతు భరోసా కేంద్రాలు, 69 ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 2 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.400 **కోట్లను రైతుల ఖాతాలకు నేరుగా జమచేసింది. అయితే కూటమి ప్రభుత్వంలో దళారుల ప్రమేయంతో రైతులకు ఖరీఫ్ ధాన్యానికి మద్దతు ధరలు అందలేదు. బస్తాకు రూ.300 వరకు తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేయడంతో** రైతులు నష్ట**పోయారు. దీంతో ఖరీఫ్ సాగు** నష్టాలను మి**గిల్చింది.**

25 వేల ఎకరాల్లో పంట నష్టం


జిల్లాలో 4.95 **లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంలో** అత్యధికంగా **వరి పండిస్తున్నారు. ఖరీఫ్** సీజన్‌లో 1.91 **లక్షల ఎకరాల్లో, రబీ సీజ**న్‌లో సుమా**రు 90 వేల ఎకరాల్లో** సాగు **ఉంటుంది.** వీటితో **పాటు ఆయిల్‌పామ్ 1,32,167,** మొక్క**జొన్న 90,674, మామిడి 35,937** ఎక**రాల్లో సాగు చేస్తున్నారు. వీటితో** పాటు **జీడిమామిడి, పత్తి,** వేరుశనగ, **మినుము, పొగాకు సాగు ఉంది.** ఈ **ఏడాది ఖరీఫ్ సీజన్‌లో** వర్షాలు, **గోదావరి వరదలతో జిల్లాలో** సుమా**రు 25 వేల ఎకరాల్లో వంట** నష్టం **వాటిల్లి** దిగుబడులపై **ప్రభావం చూపింది.**



పెదవేగి మండలంలో బరకాల్లో చేరిన వర్షం నీటిని తోడుతున్న మహిళ (ఫైల్)



బుట్టాయగూడెం మండలం వీరన్నపాలెంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు (ఫైల్)



యోగాలో ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న దృశ్యం

నూజివీడు: భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యోగాసన పోటీల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. రిథమిక్ యోగాలో ఇంజనీరింగ్ ఫస్టియర్ విద్యార్థి టి.దుర్గాప్రసాద్ తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. విద్యార్థిని డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ఏఓ బి.లక్ష్మణరావు తదితరులు అభినందించారు.

ఐఆర్‌సీటీసీ మహా కుంభ పుణ్యక్షేత్ర యాత్ర

ఏలూరు (టూటౌన్): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జనవరి 19 నుంచి మహా కుంభ పుణ్యక్షేత్ర యాత్ర ప్రారంభించనున్నట్టు రైల్వే విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్‌లో జనవరి 19న రైలు బయలుదేరి విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని మీదుగా ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా వారణాశి, అయోధ్య, హనుమాన్ గర్హి, ఆరతి, ప్రయాగ్ రాజ్ వంటి క్షేత్రాలు సందర్శించవచ్చన్నారు. యాత్ర ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్లు ఉంటుందని తెలిపారు. స్లీపర్ క్లాస్‌లో పెద్దలకు రూ.22,635, పిల్లలకు రూ.21,740 స్టాండర్డ్ క్లాస్ టికెట్ ధర పెద్దలకు రూ.31,145, పిల్లలకు రూ.30,095, కంఫర్ట్ క్లాస్ టికెట్ ధర పెద్దలకు రూ.38,195, పిల్లలకు రూ.36,935గా నిర్ణయించామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 92814 95848, 8977314121 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు

ఏలూరు (టూటౌన్): పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే కేంద్ర మంత్రి వర్గం నుంచి ఆయన్ను బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలపై మండిపడుతూ నగరంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అమిత్ షా బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, ఎంసీపీఐ (యు) నాయకుడు ఎస్.నాగరాజు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సభ్యుడు తలారి ప్రకాష్ మాట్లాడారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు దారుణమన్నారు. అమిత్‌షాను ప్రధాని మోదీ వెనకేసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ తరహా ధోరణులు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. దేశ లౌకికతత్వం, మత సామరస్యం, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు పోరాటమే మార్గమని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య, రాష్ట్ర సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిరుల తల్లి.. వరాల కల్పవల్లి

కొంగు బంగారం

- మావుళ్లమ్మ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు
- జనవరి 13 నుంచి నెల పాటు నిర్వహణ
- ప్రత్యేక పూజలు, కళా ప్రదర్శనలు
- రూ.90 లక్షలతో జాతర మహోత్సవాలు

భీమవరం(ప్రకాశం చౌక్): భక్తుల పాలిట కొంగు బంగారం.. భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మవారి 61వ వార్షిక మహోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నీరుల్లి కూరగాయ, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో దేవస్థానం సహకారంతో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 14 వరకు జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే అమ్మవారి అలంకరణ పనులు పూర్తయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద చలువ పందిళ్లు, భారీ సెట్టింగ్‌ల కోసం విద్యుత్ దీపాలంకరణ, క్యూలైన్ తదితర ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నిలువెత్తు స్వర్ణమయం

మావుళ్లమ్మవారిని నిలువెత్తు స్వర్ణమయం చేయడానికి దాతలు, భక్తుల నుంచి బంగారాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 72 కిలోల బంగారం సేకరించగా 63 కిలోల వరకూ ఆభరణాలు తయారు చేసి అమ్మవారికి అలంకరించారు. 100 కిలోలు బంగారు ఆభరణాలను అమ్మవారికి అలంకరించాలనే లక్ష్యంగా ఆలయ అధికారులు, ఉత్సవ నిర్వాహకులు దాతలను ప్రోత్సహిస్తున్నారు.

రూ.90 లక్షల వ్యయంతో..

నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో దాదాపు రూ.80 లక్షల నుంచి రూ.90 లక్షలతో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల ఆఖరి తొమ్మిది రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేస్తారు. రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జానపద, భరత నాట్య ప్రదర్శనలు, హరికథ, బుర్రకథ వంటి కళాప్రదర్శనలు, సినీ సంగీత విభావలు ఏర్పాటుచేస్తారు. సుమారు 30 నాటకాలు, 20 హరికథ, బుర్రకథలు, 15 వరకూ సినీసంగీత విభావరి కార్యక్రమాలు ఉంటాయి. ఇలా కళారంగాన్ని ప్రోత్సహిస్తున్నారు.

భారీగా భక్తుల రాక

అమ్మవారి ఉత్సవాలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. దీంతో నెలరోజుల పాటు ఆలయం వద్ద జన సందడి నెలకొంటుంది. ఆలయం వద్ద సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

లక్షల మందికి అన్నదానం

ఆలయం వద్ద నెల రోజులపాటు భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహిస్తారు. రోజుకు సుమారు 7 వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారు. అలాగే ఆఖరి రోజు మహా అన్నదానం నిర్వహిస్తారు. సుమారు లక్ష మందికి అన్నప్రసాదాన్ని అందిస్తారు. అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించడాన్ని జిల్లా ప్రజలు సెంటిమెంట్‌గా భావిస్తారు.

60 ఏళ్లుగా ఉత్సవాలు

గత 60 ఏళ్లుగా నీరుల్లి కూరగాయ, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో దేవస్థానం సహకారంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో నెల రోజులపాటు నిర్వహించే ఏకైక ఉత్సవంగా మావుళ్లమ్మ ఉత్సవాలు నిలుస్తున్నాయి. గతంలో ఉత్సవాల్లో భాగంగా సినీ, కళారంగ ప్రముఖులను సన్మానించి బంగారాన్ని బహూకరించేవారు. కరోనా విపత్తు సమయం నుంచి సన్మాన కార్యక్రమాలను నిలిపివేశారు.



మావుళ్లమ్మవారు



ఆలయం వద్ద చలువ పందిళ్లు



భారీ సెట్టింగ్‌లకు ఏర్పాట్లు

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు నగర పాలక సంస్థతో పాటు ఏడు మున్సిపాలిటీల్లో 2017లో క్వాలిఫై అయిన తెలుగు, హిందీ స్పెషల్ గ్రేడ్ టీచర్లకు పదోన్నతుల నిమిత్తం అర్హులైన వారి సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం ముగిసింది. అర్హులైన ఎస్‌జీటీల జాబితాను ఇటీవల డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఏలూరు నగరపాలక సంస్థ యూనిట్‌గా తెలుగు ఎస్‌జీటీలు 16 మంది, మిగిలిన ఏడు మున్సిపాలిటీల్లోని 29 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. అలాగే హిందీ ఎస్‌జీటీల్లో ఏలూరు నగరపాలక సంస్థ యూనిట్ నుంచి ఆరుగురు, మిగిలిన ఏడు మున్సిపాలిటీల నుంచి తొమ్మిది మంది హాజరయ్యారు.



లాంగ్ జంప్‌లో సత్తా చాటుతూ..

ఉద్యోగమే లక్ష్యంగా..

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ ప్రారంభమైంది. రెండేళ్ల క్రితం ప్రాథమిక ఎంపిక రాత పరీక్షలు పూర్తి కాగా... తాజాగా దేహదారుఢ్య పరీక్షలను చేపట్టారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం తొలిరోజు దేహదారుఢ్య పరీక్షలకు భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరై ప్రతిభను చాటారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఉదయం నుంచి గ్రౌండ్స్‌లోనే ఉంటూ పోటీలను పర్యవేక్షించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 600 మంది పురుష అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేయగా 309 మంది హాజరయ్యారు. వీరిలో 179 మంది ఎంపికైనట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో రావాలని సూచించారు. జనవరి 9 వరకు ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తామన్నారు.



పరుగు పోటీలో..



ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిషోర్



అభ్యర్థి ఛాతీ కొలతలు తీస్తూ..



అభ్యర్థుల ఎత్తు కొలతలు తీసుకుంటూ..

క్లుప్తంగా

ఎస్సీ కులగణన ఆడిట్ గడువు పెంచాలి



కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కులగణన ఆడిట్ తేదీని ఈ నెల 31 నుంచి జనవరి 20 వరకు పెంచాలని కోరుతూ ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, మాల సంఘాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి సోమవారం వినతిపత్రం అందజేశారు. డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సీ కులగణన ఆడిట్‌పై అభ్యంతరాలు తెలిపేందుకు వినతిని అందజేసారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో ఎస్సీ-మాల కులస్తులు ఎక్కువని, సర్వేలో మాల స్థానంలో వేర్వేరు కులాలు రాశాన్నారు. దీన్ని సరిచేయాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు చేసిన సర్వేను సోషల్ ఆడిట్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. వాలంటీర్లు చేసిన సర్వేను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో పల్లెం ప్రసాద్, నేతల రమేష్, దాసరి శ్యామ్ తదితరులు ఉన్నారు.

కొలిక్కిరాని బడ్జెట్ కసరత్తు

- ముస్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రత్యేకాధికారులపైనే భారం
- బడ్జెట్ రూపకల్పనపై కొత్త ఎమ్మెల్యేల ఒత్తిడి
- ఈ ఏడాది కూడా ఆలస్యమయ్యే అవకాశం



నరసాపురం మున్సిపల్ కార్యాలయ భవనం

నరసాపురం: 2023–24 ఆర్థిక సంవత్సరం మరో మూడు నెలల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో పలు ప్రభుత్వ శాఖలు తమ పరిధిలో కొత్త ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూపకల్పనలో నిమగ్నమవుతాయి. ఇందులో మున్సిపల్ పరిపాలన శాఖ అత్యంత కీలకమైంది. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఏటా డిసెంబర్ నెలాఖరుకు ఉమ్మడి పశ్చిమలోని ఏలూరు కార్పొరేషన్‌తో సహా మిగిలిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీలోలే 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ముసాయిదా పూర్తిచేసి కలెక్టర్‌కు సమర్పించాలి. కలెక్టర్ పరిశీలన అనంతరం ఆ బడ్జెట్ ముసాయిదాలపై ఆయా పురపాలక సంఘాల పాలకవర్గాలు చర్చించి నిధుల కేటాయింపులో అవసరమైన మార్పులు, చేర్పులు చేపడతాయి. డిసెంబర్ నెలాఖరుకు ఎట్టి పరిస్థితుల్లోను బడ్జెట్ ముసాయిదాలు సమర్పిస్తే వెంటనే కలెక్టర్ పరిశీలనకు పంపి ఆపై ఆయా మున్సిపాలిటీలకు పంపుతామని మున్సిపల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నుంచి మూడు నెలల క్రితమే ఆదేశాలు, సూచనలు జారీ చేసింది. అయితే ఇంకా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బడ్జెట్ రూపకల్పన పూర్తి కాలేదు. కొత్త ఎమ్మెల్యేల ఒత్తిడితో ఈ ఏడాది బడ్జెట్ రూపకల్పన ఆలస్యమయ్యే అవకాశముంది.

గతేడాదీ ఆలస్యమే

గత ఏడాది కూడా డిసెంబర్ నెలాఖరుకు బడ్జెట్ ముసాయిదాలు రూపొందించాలని మున్సిపల్ పాలక వర్గాలకు, ప్రత్యేక అధికారులకు సూచించారు. గత ఏడాది జిల్లాలోని చాలా మున్సిపాలిటీలు జనవరి నెలాఖరుకు ముసాయిదాలు సమర్పించాయి. ఎన్నికల నేపథ్యంలో ఆలస్యమైందని సదురు మున్సిపాలిటీలు వివరణ ఇచ్చాయి. ఈ ఏడాది కూడా ఉమ్మడి జిల్లాలో అదే తంతు జరుగుతోంది.

ప్రత్యేక అధికారులదే తుది నిర్ణయం

ఈ ఏడాది మున్సిపాలిటీల పరిపాలన ముఖచిత్రం పూర్తిగా మారింది. ప్రస్తుతం పశ్చిమగోదావరిజిల్లాలో ప్రధాన మున్సిపాలిటీలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్నాయి. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ముసాయిదాలు రూపొందించాల్సిన పూర్తి బాధ్యత ఆయా మున్సిపాలిటీల ప్రత్యేక అధికారులపైనే ఉంది. పశ్చిమలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగని కారణంగా ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. మునిసిపాలిటీల్లో ఇప్పటికి బడ్జెట్ ముసాయిదా రూపకల్పన ఇంకా ఓ కొలిక్కి రాలేదు. తుదిగడువు డిసెంబర్ నెలాఖరు ముగుస్తోంది. ఈ నేపథ్యంలో నిర్ణీత గడువు లోగా బడ్జెట్ ముసాయిదాలు రూపొందించి కలెక్టర్ అనుమతికి పంపలేదు. జనవరి నెలాఖరుకు కూడా ఈ తంతు ముగిసేలా కనిపించడంలేదు.

తూతూమంత్రంగా రూపకల్పన

ఏటా కొత్త బడ్జెట్ రూపకల్పన కేవలం తూతూ మంత్రంగా సాగుతోందని, గడిచిన ఆర్థిక సంవత్సర కేటాయింపులు పది శాతానికి పెంచి కొత్త బడ్జెట్ రూపకల్పన చేస్తున్నారని, ఇది సరైన ప్రక్రియ కాదనే వాదన వినిపిస్తోంది. ప్రధాన మున్సిపాలిటీల్లో పాలకవర్గాల ప్రమేయం లేకుండా కేవలం ప్రత్యేకాధికారులే బడ్జెట్ ముసాయిదాలు రూపొందిస్తున్నారు. ఈ ముసాయిదాల్లో కేవలం అంకెల గారడీ కాకుండా అవసరమైన పనులకు నిధుల కేటాయింపు పెంచాలనే భావన ప్రజల్లో వినిపిస్తోంది. ఇదే సమయంలో బడ్జెట్ ముసాయిదాల రూపకల్పనలో ఆయా మున్సిపాలిటీల ప్రత్యేకాధికారులు, పాలకవర్గాలపైనా కొత్తగా ఎన్నికైన స్థానిక ఎమ్మెల్యేల ప్రభావం ఉంది. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమ పరిధిలోని మునిసిపాలిటీల్లో ఏ ప్రాంతానికి, ఏ రంగానికి ఏ మేరకు నిధులు కేటాయించాలో వివరిస్తూ పలువురు ఎమ్మెల్యేలు అధికారులకు సూచనలు జారీ చేసినట్లు తెలిసింది. కొత్తగా ఏర్పడిన కూటమి సర్కార్ ఈ 6 నెలల కాలంలో మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు కేటాయింపులు చేయలేదు. ఈ పరిస్థితుల్లో బడ్జెట్‌లో అంకెల రూపకల్పన ఎలా అనే దానిపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నిర్ణీత గడువులోగా ముసాయిదాలు తయారు చేయలేకపోయిన అధికారులు జనవరిలోనైనా ముసాయిదాల ప్రతులు కలెక్టర్ అనుమతికి పంపుతారో.. లేదో పరిశీలించాల్సి ఉంది. ఇంత వరకు తమకు బడ్జెట్ ముసాయిదా అందలేదని రాజమండ్రిలోని మున్సిపల్ ఆర్‌డీడీ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

> **మా బడ్జెట్ తుదిదశలో ఉంది**
>
> 
>
> నరసాపురం మున్సిపాలిటీ బడ్జెట్ రూపకల్పన తుది దశలో ఉంది. వాస్తవానికి ఇప్పటికే బడ్జెట్ కౌన్సిల్ ఆమోదం జరగాలి. మేం దాదాపుగా పూర్తిచేశాం. పాలకవర్గాల నిర్ణయంపై ఆధారపడి నిర్ణయాలు ఉంటాయి, ఆలస్యానికి కారణాలు ఉంటాయి. 31న కౌన్సిల్ బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆమోదం జరిగిన వెంటనే ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు పంపిస్తాం.
>
> – ఎం.అంజయ్య, నరసాపురం మున్సిపల్ కమిషనర్

గంజాయిపై ఉక్కుపాదం



ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఐజీ


ఇరగవరం: నేరాల నియంత్రణపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఇరగవరం పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. పోలీస్ రికార్డులు పరిశీలించారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం కోసం పీస్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టకుండా అప్రమత్తంగా ఉండాలని, వారిని గుర్తించి చట్టపరమైన కేసులు పెట్టాలన్నారు. జిల్లాలో సైబర్ క్రైం ఎక్కువగా జరుగుతుందని, సైబర్ నేరాలు అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం తదితర రైల్వే స్టేషన్ సమీప ప్రాంతాలలో గంజాయి విస్తరిస్తుందని చెప్పారు. గంజాయి సరఫరా చేస్తున్న వారిని గుర్తించి నిఘా పెట్టాలన్నారు. గంజాయి నిర్ధారణ జరిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 14500 నెంబరు కాల్ చేయాలని సూచించారు. ఎస్పీ ఎ.నయీ అస్మీ, డీఎస్పీ డి.విశ్వనాథ్, సీఐ బి.కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానం సాయం తీసుకోవాలి

భీమవరం: కేసుల దర్యాప్తులో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని వేగవంతంగా కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం భీమవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, కేసుల నమోదు, దర్యాప్తు వంటి విషయాలపై ట్రాఫిక్ అధికారులకు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు.

మృతదేహం వెలికితీత

దెందులూరు: దెందులూరు శివారు అలుగులగూడెంలో ఈ నెల 4న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మద్దల చిన్న యేసు మృతదేహాన్ని సమాధి నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు దెందులూరు ఎస్సై, తహసీల్దార్ బీ సుమతి, ఏలూరు వైద్యశాల ప్రొఫెసర్ సమక్షంలో మృతదేహాన్ని సమాధి నుంచి బయటకు తీశారు. అనంతరం మృతదేహం నుంచి పరీక్షలకు కావాల్సిన వాటిని ఏలూరు తీసుకెళ్లారు.



స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



స్వామినాయుడు, బి.భవానీ, రవికార్తీక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జాతీయ సౌత్ జోన్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన బలగ స్వామినాయుడును కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. విజయవాడ లో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించిన 35వ జాతీయ సౌత్ జోన్‌లో జిల్లాకు చెందిన బలగ స్వామినాయుడు 50 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావుతో కలిసి స్వామినాయుడు కలెక్టర్‌ను కలవగా అభినందించి భవిష్యత్ మరిన్ని విజయాలు సాధించాలన్నారు. బుడిగిన భవానీ, రవి కార్తీక్ ఎజీ 4.200 మీటర్ల ఫ్రీ స్టైల్ రిలే విభాగంలో, 4.100 మీటర్ల ఫ్రీ స్టైల్ రిలే విభాగంలో ఆంధ్రప్రదేశ్ టీంకు ప్రాతినిధ్యం వహించారు. ఈ టీం 2వ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ ను కైవసం చేసుకోవడం ప్రసంశనీయమన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు, కోచ్ బి.గణేష్‌ను అభినందించారు.

ముసునూరులో పిచ్చికుక్క స్వైర విహారం

14 మందికి తీవ్ర గాయాలు



ముసునూరులో పిచ్చి కుక్క కాటుకు గురైన బాధితురాలు



ముసునూరు పీహెచ్‌సీలో పిచ్చి కుక్క కాటు బాధితులకు చికిత్స

ముసునూరు: మండల కేంద్రం ముసునూరులో పిచ్చికుక్క పలువురిని గాయపర్చడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సోమవారం వలసపల్లి వైపు నుంచి ముసునూరు హరిజన వాడలోనికి ప్రవేశించిన పిచ్చికుక్క పలువురిని కరిచింది. అక్కడి నుంచి ఊరి మధ్యలోకి ప్రవేశించి మరికొందరిపై తీవ్రంగా దాడి చేసి కరవడంతో 14 మంది కుక్కకాటుకు గురయ్యారు. గాయపడిన వారిలో పిల్లలు, పెద్దలు ఉన్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి షకీనా ఇవాంజిలిన్ బాధితులకు ప్రథమ చికిత్స చేసి, రేబిస్ వ్యాక్సిన్ వేశారు. తీవ్రంగా గాయపడిన ఆశా వర్కర్‌ను విజయవాడకు రిఫర్ చేశారు. మిగిలిన వారిని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్క దాడితో ప్రజలు ఇళ్ళలోనుంచి బయటకు రావడానికి భయపడ్డారు. సాయంత్రానికి స్థానిక యువకులు కొందరు ధైర్యం చేసి, పిచ్చి కుక్కను వెంబడించి, కర్రలతో కొట్టి చంపడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

4,831 అర్జీల స్వీకరణ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన 479 గ్రామ రెవెన్యూ సదస్సుల్లో 4,831 అర్జీలు అందగా, 1793 అర్జీలకు పరిష్కారం చూపామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. జిల్లాలో సోమవారం నిర్వహించిన 35 రెవెన్యూ సదస్సుల్లో ఆయా సమస్యలపై 209 అర్జీలను ప్రజలు అందజేయగా వీటిలో అక్కడికక్కడే 90 అర్జీలను పరిష్కరించామన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం (ప్రకాశంచౌక్): జనవరి ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు శ్రీత్యాగరాజ మ్యూజిక్ అకాడమీ (త్యాగరాజ భక్తసభ) అధ్వర్యంలో 106వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మ్యూజిక్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కారుమూరి ఆదిత్య తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో బ్రోచర్‌ను విడుదల చేసి మాట్లాడారు. జనవరి ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు సాయంత్రం ఆరున్నర గంటల నుంచి ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం, పదో తేదీన ఏఎస్ఆర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిటీ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి మాట్లాడుతూ ఆరో తేదీన ఉదయం ఎనిమిదిన్నర గంటలకు స్వామి వారి ఊరేగింపు, సాయంత్రం ఆరున్నర గంటలకు ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కారుమూరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని కోలమూరులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి



మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీ కోసంలో)లో అందిన అర్జీల పరిష్కారం జవాబుదారీతనంతో ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 207 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కరరావు, ఎం.ముక్కంటితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో సమర్పించే అర్జీలకు సత్వర పరిష్కార దిశగా పనిచేయడం అత్యంత ప్రధానమన్నారు. అర్జీల పరిష్కారంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు విచారణ చేపట్టి నిర్దేశించిన సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అందిన అర్జీల్లో కొన్ని..

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో మార్ట్‌గేజ్ లోను తీర్చేశామని, ఈసీ తీసుకున్నప్పుడు అందులో లోను చెల్లించాల్సి ఉన్నట్లు ఉందన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి లోన్ క్లియరెన్స్ సర్టిఫికెట్ జారీచేసేందుకు చర్యలు తీసుకోవాలని చింతలపూడి మండలం రేచర్ల గ్రామానికి చెందిన యం.లలిత సూర్యపద్మావతి అర్జీనిచ్చారు. 22ఎ నిషేధిత జాబితాలో ఉన్న తమ భూమిని సదరు జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని దెందులూరు మండలం కొత్తగూడెంకు చెందిన మాగుంట నాగేంద్రప్రసాద్ అర్జీనిచ్చారు. తమ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం, 1 బీ అడంగళ్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏలూరు రూరల్ మండలం కొమడవోలుకు చెందిన గుండిగుంట రుక్మిణీదేవి కోరారు. దుర్వినియోగమైన పంచాయతీ నిధుల విషయంపై విచారణ జరపాలని ఉంగుటూరు మండలం వెలమెల్లి గ్రామానికి చెందిన దండమూడి నాగేశ్వరరావు కోరారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి తిరువీధి సేవ



ఉభయ దేవేరులు, గోదాదేవితో క్షేత్ర వీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు చినవెంకన్న ఉభయ దేవేరులు, గోదాదేవితో కలిసి క్షేత్ర వీధుల్లో అట్టహాసంగా ఊరేగుతున్నారు. ఈ క్రమంలో సోమవారం నిర్వహించిన స్వామివారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం క్షేత్ర వీధులకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవల నడుమ గ్రామోత్సవం జరిగింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

ఉప్పరగూడెంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో జనవరి 14, 15, 16వ తేదిల్లో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.35 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.10వేలు అందజేయనున్నట్లు వివరించారు. 14న మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామని, విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. ముందుగా రూ.200 చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు



ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): సేంద్రియ ఆహారం, ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరం వద్ద ఏర్పాటుచేసిన సేంద్రియ ఉత్పత్తుల విక్రయశాలను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి ఆమె సందర్శించారు. ప్రతి సోమవారం ఈ ఉత్పత్తులపై అవగాహన, ప్రోత్సహించేందుకు ఆయా ప్రకృతి వ్యవసాయం వారి సహకారంతో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ఆయా సేంద్రియ ఉత్పత్తుల విక్రయశాలలో ఉత్పత్తుల ప్రత్యేకతను నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొన్ని ఉత్పత్తులను కలెక్టర్, జేసీ కొనుగోలు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సాగుచేసిన ఉత్పత్తులు ప్రజలకు మేలుచేస్తాయని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ బాషా, ఉద్యానశాఖ డీడీ ఎస్ రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

జూడోలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

పెదపాడు: రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో వట్లూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల మంగళగిరిలోని నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించిన జూడో టోర్నమెంట్‌లో వెండి పతకంతో పాటు 7 పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి తెలిపారు. 70 కేజీల విభాగంలో టీ దివ్యతేజ రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించింది. జూనియర్ విభాగంలో మనోహరిణి, ప్రవల్లిక సబ్ జూనియర్స్ విభాగంలో కే దయ, లక్ష్మి, కావ్య రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు.

కాళ్లకూరు వెంకన్నకు పుష్ప యోగం



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూల మొక్కలు

కాళ్ల: ఆహ్లాద వాతావరణంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శనం ఎంతో ప్రశాంతతనిస్తుందని భక్తులు చెబుతున్నారు. కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభు శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన పూల మొక్కలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ధనుర్మాసం శీతాకాలం కావడంతో ఆలయ ప్రాంగణంలో పలు రకాల పూల మొక్కలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూల మొక్కల చెంత సేద తీరుతుంటే ఎంతో పారవశ్యం పొందుతున్నామని భక్తులు చెబుతున్నారు. ఆలయ కమిటీ వారిని ఉద్యోగులను భక్తులు దాతలు అభినందిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ టైలరింగ్ వర్క్ షాప్ ఫ్రాంచేంజ్‌గా ఇన్వెస్ట్‌మెంట్ చేసేవారు కావలెను. నెలనెల పనికి తగ్గ ఆదాయం కల్గును. ఫోన్ : 90007 92363, 70936 32399 [V-823984]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2587]

సినిమా వార్తల కోసం లాగ్‌ఆన్ అవ్వండి www.sakshi.com

Wanted

■ ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా మా MNC కంపెనీలో వర్క్ ఫ్రం హోం. స్త్రీ పురుషులు కావలెను. Qul: 10- డిగ్రీ, మంచిజీతం,ఉచిత రూము భోజనసదుపాయం.9019041491, 9036607717 [G-9124]

■ కష్టలైన్నీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197693 [HA-99434]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.